వున్న లేబొరేటరీకి పరిగెత్తింది. వాళ్ళు ఆ సున్నం ముక్కని తలనెప్పికి వేసుకునే ఆస్ప్రిన్ టాబ్లెట్ అని చెప్పారు.

"నేనూ అక్కడికొస్తాను నాన్నా" అని లెన్స్ ఒకటి పుచ్చుకుని సూర్యారావు ఇంటికి వచ్చింది సుబ్బారావు కూతురు. ఆ అమ్మాయి పేరు సుశీల. ఆ వీధిలో అనూరాధని తెలీని వాళ్ళెవరూ లేరు. ఆమె రాకపోకల్ని బట్టి గడియారాలు సరిచేసుకునేవాళ్ళు, ఆమెను చూసి ఇళ్ళు తీర్చిదిద్దుకునేవాళ్ళు, ఆమెని అనేక విషయాల్లో అనుకరించేవాళ్ళు, అలా ఎందరో! సుశీల జనాన్ని తప్పించుకుని వచ్చి అనూరాధ చేతిమీద లెన్స్ పెట్టి చూసింది. ఆమె శరీరం సున్నంలా కాదు మారిపోయింది. ఆమె శరీరం మొత్తం రకరాకల టాబ్లెట్లు అతుకుపెట్టినట్లు ఉంది. కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి. కొన్ని లేత గులాబిరంగువి. కొన్ని గుండ్రనివి. కొన్ని పలకలవి. ఇలా రకరకాల టాబ్లెట్లు అతికించి చేసిన బొమ్మలా వుంది అనూరాధ.

"చీమలొస్తున్నాయండీ" అందొకావిడ కంగారుగా.

"అవును అందులో కొన్ని షుగర్ కోటెడ్ టాబ్లెట్స్ వుండి వుండవచ్చు గద" అంది సుశీల.

'అవును షుగర్ కోటెడ్ టాబ్లెట్స్ తనూ ఇచ్చాడు కొన్ని ఆమెకి' అనుకున్నాడు సూర్యారావు.

సుశీల చేతిలో నుంచి లెన్స్ లాక్కుని చూస్తున్నారు. సూర్యారావు చూడకుండా ఆమె చేతుల్నీ, కాళ్ళనీ గిల్లి చూస్తున్నారు ఇంకా కొందరు.

చాప మీద నుంచి ఆమె శరీరాన్ని ఒక బల్ల మీదికి చేర్చారు. చుట్టూ చీమల మందు చల్లారు. కూతురు వచ్చే వేళకి ఆమె శరీరాన్ని ఒక్కొక్కరే గిల్లీ గిల్లీ మాయం చేసేస్తారే మోననిపించింది సూర్యారావుకి. "శవాన్ని పడకగదిలోకి తరలించండి" అన్నాడు ఉన్నట్టుండి.

"తప్పు నాయనా అలా పెట్టకూడదు. ఏం నక్షత్రమో ఏమో" అంది పక్కింటి మామ్మగారు.

"ఫరవాలేదు మామ్మగారూ! ఈ ఇల్లు ఆవిడ కట్టింది. ఈ ఇంటికోసం ప్రతీ రక్తం బొట్టూ వెచ్చించింది. అందుకోసం ఆమె శరీరం ఎక్కడన్నా పెట్టవచ్చు" అని అనూరాధ శరీరాన్ని దాచిపెట్టేశాడు సూర్యారావు.

ఇరవై ఎనిమిదేళ్ళ సాహచర్యం. అన్నీ ఇచ్చింది. స్నేహం-ప్రేమ-ధనం-సేవ- ఆఖరికి ఇప్పుడు ప్రాణం.

ఇల్లంతా జనంతో నిండిపోయింది. ఇంట్లో ఇంతమంది జనం ఉండడం అనూరాధ కిష్టం వుండదు. తను వేయించుకున్న మార్బుల్ రాళ్ళు మాసిపోతే సబ్బు పెట్టి కడుక్కుని తుడుచుకునేది - బాత్‌రూంలు కడుక్కు నేది. వచ్చినవాళ్ళు తళతళలాడే అనూరాధ గ్యాస్ పొయ్యి మీద పాలు మరగపెట్టి పొంగించేస్తున్నారు - సోఫాలన్నీ విరగదొక్కుతున్నారు. అనూరాధ ప్రాణం ఎంత విలవిలలాడిపోయేదో! సూర్యారావు నిస్సహాయుడు. అతనికేం

